# దగా కాంగ్రెస్.. వంచనా శిల్పం

కాంగ్రెస్ ఫేక్‌ఫ్యాక్టరీలో తయారైన ఓ క్లిప్పింగ్

మొదటిపేజీ తరువాయి...

ఆలోచనలేవో చేస్తున్నట్టు కల్పిత కథనాలను ఈ-పేపర్ క్లిప్పుల రూపంలో ప్రజల్లోకి పంపింది. దీనిపై బీఆర్ఎస్ శ్రేణుల్లో, కార్యకర్తల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఇటీవల బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో అనూహ్యమైన ఆదరణ కనిపిస్తున్నది. ఎక్కడ చూసినా ప్రజలు కేసీఆర్‌నే తలుచుకుంటూ.. మళ్లీ ఆయన వస్తేనే తెలంగాణ బాగుపడుతుందన్న అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. బీఆర్ఎస్ సంపూర్ణ ఆధిక్యంతో తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ప్రజలతోపాటు రాజకీయ విశ్లేషకులు, మీడియా ప్రతినిధులు కూడా అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌లో ఏదో జరుగుతున్నదనే అభూతకల్పనను వ్యాప్తిచేయడానికి కాంగ్రెస్ సోషల్ మీడియాను అడ్డంపెట్టుకుని ప్రయత్నాలు చేస్తున్నది. ఇందుకోసం కాంగ్రెస్ ఒక టీమ్‌నే ఏర్పాటు చేసినట్టు తెలిసింది. ఆ బృందం ముఖ్యనేతల కుటుంబసభ్యుల కనుసన్నల్లోనే పనిచేస్తున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 'బీఆర్ఎస్‌కు సంబంధించిన నకిలీ వార్తలను సృష్టించడమే ఈ టీమ్ పని. ఈ-పేపర్ క్లిప్ రూపంలో ఊరూపేరూ లేని వార్తలు తయారు చేసిన తర్వాత వాటికి సదరు పెద్దల నుంచి అనుమతి కూడా తీసుకుంటారు. అనంతరం సోషల్ మీడియాలోకి వదులుతారు. ఇదే అదనుగా కాంగ్రెస్ అనుబంధ సోషల్‌మీడియా ఖాతాలు వాటిని లెక్కకు మిక్కిలిగా ప్రజల్లోకి పంపిస్తుంటాయి. ప్రజల్లో బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ఆదరణను తగ్గించడం, విభేదాలున్నట్టుగా ప్రచారం చేయడం, జనంలో అయోమయాన్ని, గందరగోళాన్ని సృష్టించడం, విషబీజాలు నాటి శ్రేణుల్లో చీలికలు తేవడం ప్రధాన ధ్యేయంగా ఈ టీమ్ పనిచేస్తున్నది' అని కాంగ్రెస్ వ్యవహారాలను దగ్గరినుంచి చూస్తున్న ఓ పాత్రికేయ ప్రముఖుడు వివరించారు. ఫేక్‌న్యూస్ క్రియేట్ చేసే స్థాయికి కాంగ్రెస్ దిగజారడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా భారీ బహిరంగసభ తేదీ ప్రకటించినప్పటి నుంచి ఈ టీమ్ ఫేక్‌న్యూస్‌ను వదలడమే పనిగా పెట్టుకున్నది. కాంగ్రెస్ పాలనపై ప్రజావ్యతిరేకత పెరిగిపోతుండటం, బీఆర్ఎస్ రజతోత్సవ సభకు లక్షలాదిగా ప్రజలు తరలివెళ్లే సంకేతాలు అందుతుండటంతం కాంగ్రెస్ ఫేక్‌న్యూస్ ఫ్యాక్టరీ బీఆర్ఎస్‌పై విషం చిమ్మడాన్ని పెంచుతూ పోయింది. బీఆర్ఎస్‌పై అసత్య ప్రచారాల కోసం నకిలీ ఈ-పేపర్ల క్లిప్పులను అడ్డంపెట్టుకొని వదంతులను ముమ్మరంగా వ్యాప్తి చేసింది. 'బెట్టింగ్ మాఫియాతో కేటీఆర్‌కు లింకులు' అని ఒకటి.. 'ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో క్షుద్రపూజలు' అని మరొకటి.. 'వరంగల్ సభ రద్దు' అంటూ ఇంకొకటి.. ఇట్లా ఫేక్‌న్యూస్ క్రియేట్ చేసి ప్రజల్లోకి వదిలారు. కనీవినీ ఎరుగని రీతిలో బీఆర్ఎస్ సభ రికార్డు బ్రేక్ కావడం, ఆ సభలోనే పహల్గాంలో ఉగ్రదాడిలో సువులు బాసిన వారి ఆత్మశాంతికి యావత్ తెలంగాణ సమాజం బీఆర్ఎస్ నాయకత్వంలో నివాళులు అర్పించడంతో జీర్ణించుకోలేని సదరు టీమ్.. '2028లో బీఆర్ఎస్ కష్టమే' అనే క్లిప్పింగుతోపాటు, హరీశ్‌రావుపైనా మరో తప్పుడు కథనం వదిలింది. 'కొత్త పార్టీ పెట్టడమా? బీజేపీలో చేరడమా?' అంటూ ఫేక్‌న్యూస్ క్రియేట్ చేసి వదలటంపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణను గాడిలో పెట్టి, పూర్వవైభవం తేవాలంటే అది కేసీఆర్‌తోనే సాధ్యమని ప్రజలు భావిస్తున్న తరుణంలో కేసీఆర్‌ను తిరిగి సీఎంను చేయడమే ధ్యేయంగా పార్టీ లీడర్, క్యాడర్ పనిచేస్తుంటే రాజమార్గంలో ఢీకొట్టే శక్తిలేక వదంతులను వ్యాప్తిచేయడమే కాంగ్రెస్ పనిగా పెట్టుకున్నదని బీఆర్ఎస్ ముఖ్యులు పేర్కొంటున్నారు. కాంగ్రెస్‌కు త్వరలోనే బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు.

# కుల, జనగణన పేరిట కుట్రలు

## కార్మికుల త్యాగం వెలకట్టలేనిది

- ఎన్నో పథకాలు అమలుచేశాం
- ఆర్టీసీ కార్మికులకు జీతభత్యాలు పెంచాం
- సింగరేణికి బోనస్ ఇచ్చాం
- మహిళలకు భద్రత కల్పించాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి
- ఎక్స్ వేదికగా కార్మికులకు మేడే శుభాకాంక్షలు

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ) : కార్మికుల రెక్కల కష్టం జాతి సంపదను సృష్టిస్తుందని, వారి త్యాగం వెలకట్టలేనిదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. గురువారం మేడే సందర్భంగా ఎక్స్ వేదికగా కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. 'కార్మికుల కోసం కేసీఆర్ హయాంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశాం. ఆర్టీసీ కార్మికులకు జీతభత్యాలు పెంచాం. ఆరోగ్య బీమా వంటి సంక్షేమ పథకాలతోపాటు వారికి భరోసా కల్పించాం. సింగరేణి కార్మికులకు బోనస్‌తోపాటు ఉద్యోగ భద్రత కల్పించాం. ఆటో డ్రైవర్లకు, అసంఘటిత కార్మికులకు ఆర్థికసాయంతోపాటు సంక్షేమ బోర్డులతో అండగా నిలిచాం. లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాం. మహిళా కార్మికులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాం' అని గుర్తుచేశారు. కార్మికుల హక్కుల కోసం బీఆర్ఎస్ తరపున నిరంతరం పోరాడుతామని, మేడే స్ఫూర్తితో కార్మికుల ఐక్యత, సమానత్వం కోసం కలిసి నడుద్దామని సూచించారు.

## అధికారాన్ని కాపాడుకొనేందుకు ఎత్తుగడలు

- బీజేపీ, కాంగ్రెస్ పాలనలో బీసీలకు ద్రోహం
- చట్టాలను మార్చి కార్మిక హక్కులను కాలరాస్తున్న మోదీ
- చట్టబద్ధత ముసుగులో దగా చేస్తున్న రేవంత్‌రెడ్డి
- కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే అన్నివర్గాలకు న్యాయం
- మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి
- తెలంగాణ భవన్‌లో ఘనంగా మేడే వేడుకలు

తెలంగాణ భవన్‌లో మే డే వేడుకల్లో అభివాదం చేస్తున్న మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్

హైదరాబాద్, మే 1(నమస్తే తెలంగాణ): కుల, జనగణన పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కొని కుట్రలకు తెరలేపాయని శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మండిపడ్డారు. అధికారాన్ని కాపాడుకునేందుకు ఎత్తుగడలు వేస్తూ బలహీనవర్గాలకు అన్యాయం చేస్తున్నాయని నిప్పులుచెరిగారు. కులగణనకు చట్టబద్ధత కల్పిస్తామని ఏడాది నుంచి ఊదరగొట్టిన సీఎం రేవంత్ ఇప్పుడు చేతులెత్తేసి ప్రధాని మోదీకి వంత పాడుతున్నారని దుయ్యబట్టారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కోటాను ఎగ్గొట్టేందుకు కుయుక్తులు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు నిర్వహించారు. మధుసూదనాచారి ముఖ్య అతిథిగా హాజరై కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ అవసరాల కోసమే పాలకులు కులగణనను వాడుకుంటున్నారని ఆరోపించారు. బీసీల అభ్యున్నతిపై బీజేపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. దేశంలో 50 శాతం జనాభా ఉన్న బీసీలకు మంత్రిత్వ శాఖ ఎందుకు ఇవ్వలేదు? పదకొండేండ్లుగా అధికారంలోకి ఉన్న మోదీకి ఇప్పుడే కులగణన ఎందుకు యాదికొచ్చింది? అని ప్రశ్నించారు. హామీలను అమలుచేయకుండా ఓ వైపు మోదీ బీసీలను మోసం చేస్తుంటే, మరో వైపు రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ఎన్నికల మ్యానిఫెస్టో వాగ్దానాలను అటకెక్కించి ద్రోహం చేస్తున్నారని తూర్పారబట్టారు. పదేండ్ల కేసీఆర్ పాలనలోనే బడుగు, బలహీనవర్గాలు, కార్మికులకు మేలు జరిగిందని మధుసూదనాచారి తెలిపారు. మ్యానిఫెస్టోలో పెట్టని అనేక పథకాలను అమలు చేసి బీసీల జీవితాల్లో మార్పు తెచ్చారని కొనియాడారు. కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని, ఆయనతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 21, 22 తేదీల్లో తలపెట్టనున్న కార్మికుల సార్వత్రిక సమ్మెకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇవ్వనున్నట్టు మధుసూదనాచారి ప్రకటించారు. కేంద్రంలోని మోదీ సర్కారు కార్మిక చట్టాలను కాలరాస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు ఎన్నికల హామీలను గాలికొదిలి కార్మికులకోసానికి తీవ్ర అన్యాయం చేస్తున్నదని విమర్శించారు.

### కార్మికులను కాపాడుకున్నది కేసీఆరే : ఎమ్మెల్యే పల్లా

తెలంగాణ ఉద్యమంలో ముఖ్యభూమిక పోషించిన కార్మికవర్గాన్ని కేసీఆర్ పాలనలో కంటికిరెప్పలా కాపాడుకున్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి గుర్తుచేశారు. దేశంలోనే ఎక్కడాలేనివిధంగా ఉద్యోగులకు 73 శాతం పీఆర్సీ ఇచ్చి భారీగా వేతనాలు పెంచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. క్రమంతప్పకుండా డీఏలు, ఐఆర్‌లు ఇచ్చి ఆదర్శంగా నిలిచినట్టు పేర్కొన్నారు. అంబేద్కర్ సచివాలయంలో మొట్టమొదటి సంతకం చేసి కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని కొనియాడారు. ప్రస్తుత రేవంత్ సర్కారు డీఏలు ఎగ్గొట్టినా, పీఆర్సీ మాటెత్తకున్నా ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్థం కావడంలేదని అన్నారు. కేసీఆర్ పన్ను మాఫీ చేసి ఆటో కార్మికుల జీవితాలను గట్టెక్కిస్తే, రేవంత్ రెడ్డి ఏడాదికి రూ.12 వేలు ఎగ్గొట్టి రోడ్డున పడేశారని ధ్వజమెత్తారు.

### కాంగ్రెస్ పాలనలో అరిగోస : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్ పాలనలో రైతులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు అరిగోస పడుతున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆవేదన వ్యక్తంచేశారు. కేసీఆర్ హయాంలో హోంగార్డుల వేతనాలను రూ.30 వేలకు పెంచారని, శాంతా బయోటెక్‌లో ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేశారని గుర్తుచేశారు. రేవంత్ అస్తవ్యస్త పాలన చూస్తున్న ప్రజలకు కేసీఆర్ విలువ తెలుస్తున్నదని పేర్కొన్నారు. అందుకే మళ్లీ కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని తెలిపారు.

### 2014 ముందు పరిస్థితులు పునరావృతం: మాజీ ఎంపీ బడుగుల

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 2014 ముందు పరిస్థితులు పునరావృతమవుతున్నాయని మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఆర్యోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టంచేశారు. కానీ, అంతాసిద్ధం చేసిన ఫైల్‌పై సంతకం చేసి గొప్పగా చెప్పుకోవడం దుర్మార్గమన్నారు. ఇందుకోసం రూ.50 కోట్లు వెచ్చించి అడ్వర్టైజ్‌మెంట్లు వేయించుకోవడం బాధాకరమన్నారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నట్టు తెలిపారు.

### కార్మికులకు అండగా ఉంటాం : బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు

సమస్యల కోసం పోరాడే కార్మిక వర్గానికి బీఆర్టీయూ అండగా ఉంటుందని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ భరోసా ఇచ్చారు. హక్కుల సాధనకు వారి తరపున ఉద్యమిస్తామని స్పష్టంచేశారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతూ కార్మికులకోసాన్ని దగా చేస్తున్నదని విమర్శించారు. అధికారంలోకి రాగానే అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తల వేతనాలు పెంచుతామని చెప్పిన రేవంత్ సర్కారు ఇప్పుడు ఆ ఊసే మరిచిందని దుయ్యబట్టారు. ఆటోడ్రైవర్ల నుంచి హమాలీల దాకా అందరినీ కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఉద్యోగ సంఘాల నాయకులు దానకర్ణాచారి, బాలకృష్ణ, నారాయణ ఆరోపించారు. కార్యక్రమంలో హమాలీ శ్రీనివాస్, నిర్మలారెడ్డి, కాశిరెడ్డి పాల్గొన్నారు.

## అసమానతలు లేని సమాజాన్ని నిర్మించాలి

- లేబర్‌కోడ్ల రద్దు కోసం ఐక్య ఉద్యమాలు చేయాలి
- మేడే వేడుకల్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపు

హైదరాబాద్, మే 1(నమస్తే తెలంగాణ): అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ఉద్యమించాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కార్మికలోకానికి పిలుపునిచ్చారు. మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటాలకు సిద్ధంకావాలని కోరారు. గురువారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె కార్మికులకు శుభాకాంక్షలు తెలిపి.. పలు కార్మిక సంఘాల నాయకులను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చిందని ఆరోపించారు. వీటి రద్దుకోసం సంఘటితంగా ఉద్యమించాలని ఉద్బోధించారు. భూమి లేనివారిని ఆదుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందని అన్నారు. పనుల్లో పురుషులతో మహిళలు పోటీ పడుతున్నారని, వేతనాల్లో వ్యత్యాసం ఉండకూడదని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రూప్‌సింగ్, అంగన్‌వాడీ, ఆశ, వీఏవో యూనియన్ల రాష్ట్ర అధ్యక్షురాళ్లు ఆడెపు వరలక్ష్మి, సంతోషి, మాధవి, ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య, శ్రీనివాస్, నారాయణ, మిట్టపల్లి సురేందర్, సందీప్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ మంత్రి దయాకర్‌రావు
- పార్టీ సభ్యత బీమాచెక్కు అందజేత


మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచంపల్లిలో పార్టీ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కును అందజేస్తున్న దయాకర్‌రావు

పెద్దవంగర, మే 1: బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు భరోసా ఇచ్చారు. మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం పోచంపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త పిండి యాకయ్య ఇటీవల మృతి చెందాడు. గురువారం బాధిత కుటుంబానికి పార్టీ బీమా రూ.2లక్షల చెక్కును దయాకర్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఇబ్బంది పడకూడదనే ముందుచూపుతో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ దేశంలోనే మొదటిసారిగా కార్యకర్తల కుటుంబాలను ఆదుకోవడంలో భాగంగా బీమాను కల్పించినట్టు తెలిపారు.

## మాటలు కాదు.. చేతల్లో చూపాలి

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- కులగణనను ప్రకటనకే పరిమితం చేయొద్దు
- చట్టసభల్లో 50% బీసీ రిజర్వేషన్లు కల్పించాలి
- కేసీఆర్ తెచ్చిన బీసీ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్ ఆపారు
- బీఆర్ఎస్ మాజీ మంత్రి వీ శ్రీనివాసగౌడ్ ఫైర్

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): జనగణనతోపాటు కులగణన కూడా చేపట్టనున్నట్టు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం.. దానిని మాటలకే పరిమితం చేయకుండా చేతల్లో చూపాలని బీఆర్ఎస్ మాజీ మంత్రి వీ శ్రీనివాసగౌడ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు దక్కితేనే బడుగు బలహీనవర్గాలకు సంపూర్ణ న్యాయం జరిగినట్టవుతుందని తెలిపారు. విద్యాఉద్యోగాల్లో కూడా బీసీలకు 50% రిజర్వేషన్లు అమలు చేసి తీరాలని డిమాండ్ చేశారు. బీసీల కోసం కేంద్రంలో ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీల కులగణన అంశంపై తొలుత మాట్లాడింది బీఆర్ఎస్సేనని, 2014లోనే పార్టీ అధినేత కేసీఆర్ బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ల అమలుకోసం తీర్మానం చేసి, కేంద్రానికి ప్రతిపాదన పంపిన విషయాన్ని గుర్తుచేశారు. కులగణన చేయాలని 2021లో బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిందని చెప్పారు. బీసీల జనాభా దామాషా ప్రకారం సీఎం రేవంత్ మంత్రి పదవులు, కార్పొరేషన్ల చైర్మన్ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ వల్లే బీసీగణనపై కేంద్రం దిగి వచ్చిందని సీఎం రేవంత్ చంకలు గుద్దుకుంటున్నారని, కానీ, యూపీఏ సర్కారు హయాంలోనే కేసీఆర్ నాటి ప్రధానిపై ఒత్తిడి తెచ్చినట్టు మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ పేర్కొన్నారు. కేసీఆర్ కులవృత్తులను కాపాడితే.. సీఎం రేవంత్ మాత్రం బీసీ పథకాలను నిలిపివేశారని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ దుయ్యబట్టారు.

## తులం బంగారమేది?

- రూ.2,500 ఇంకెప్పుడిస్తరు?
- కేసీఆర్ కిట్టును ఎందుకివ్వడం లేదు?
- హామీలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్ పేట్, మే 1: కల్యాణలక్ష్మి చెక్కులు సరే తులం బంగారం ఏది? ప్రతి మహిళకు ఇస్తానన్న రూ.2,500 ఏమాయే? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి వంద రోజుల్లో మహిళలకు ఇస్తానన్న హామీలు ఎందుకు నెరవేర్చలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంమీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 83 కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఆమె అందజేశారు. బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చెక్కులు తీసుకున్న ప్రతి ఒక్కరూ తులం బంగారం ఏది? అని ప్రశ్నిస్తున్నారని చెప్పారు. కల్యాణలక్ష్మి చెక్కులు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం బాకీ ఉన్నదని స్పష్టంచేశారు. కేసీఆర్ కిట్టును ఎందుకు రద్దు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉన్న పథకాలను రద్దుచేసి వారిని కోటీశ్వరులను చేస్తామని ఎలా చెప్తారని నిలదీశారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కోటి మంది మహిళలు ఉన్నారని, వారిలో ఏ ఒక్కరినైనా కోటీశ్వరురాలిని చేశారా..? అని నిలదీశారు. తప్పుడు వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేయడం తప్ప అమలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకాదని విమర్శించారు. కార్యక్రమంలో డీటీ మణిపాల్‌రెడ్డి, ఆర్ఐ ప్రశాంతి, కమిషనర్ జ్ఞానేశ్వర్, ఆర్వో చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, దిండు భూపేశ్‌గౌడ్, అరకల భూపాల్‌రెడ్డి, దీప్లాల్ చౌహాన్, శీనునాయక్, బొక్క రాజేందర్‌రెడ్డి, మదారి రమేశ్, పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అవినాశ్, సునీతాబాలరాజ్, పంతంగి మాధవి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి హామీలకు సంబంధించి జాబితాను ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

## రేవంత్.. కేసీఆర్‌పై అక్కసు ఎందుకు?

- బీఆర్ఎస్ సభలో పేరెత్తనందుకా కోపం?
- నువ్ మంచి పనులు చేస్తేనే అందరికి గుర్తుంటవ్
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట, మే 1 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ సభలో కేసీఆర్ తన పేరును ఉచ్చరించలేదన్న కారణంతో సీఎం రేవంత్‌రెడ్డి అక్కసు వెళ్లగక్కడంపై మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులే ఆయన పేరు మర్చిపోతున్నారని తెలిపారు. కనీసం ఒక్కటైనా మంచి పనిచేస్తే ఎవరో ఒకరు రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గుర్తిస్తారని పేర్కొన్నారు. పదోతరగతి ఫలితాల విడుదల, బసవేశ్వర జయంతి కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి అసలు విషయం పక్కన పెట్టి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం జగదీశ్‌రెడ్డి సూర్యాపేటలో మీడియాతో మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ సభ జరిగిన తీరును చూసి కాంగ్రెస్ నేతల ముఖాలు వాడిపోయాయని తెలిపారు. కాంగ్రెస్ అంటే తాను ఒక్కడినేనన్న భ్రమలో రేవంత్ ఉన్నారని, ఆయనకు కాంగ్రెస్ పార్టీ కన్నా వ్యక్తిగత ప్రచారంపైనే ఆసక్తి ఎక్కువని ఎద్దేవా చేశారు. సోనియా గాంధీని బలిదేవత అన్న మాటలు మర్చిపోయావా? అని రేవంత్‌ను ప్రశ్నించారు. తెలంగాణలో పదవులు అనుభవిస్తూ ఆంధ్రాకు వత్తాసు పలుకడం సిగ్గుచేటని అన్నారు. ఎన్ని రోజులు సీఎం పదవిలో ఉంటాడో గ్యారెంటీ లేని రేవంత్‌రెడ్డి.. అడ్డగోలు హామీలిచ్చి అమలు చేయలేక కేసీఆర్‌పై చిల్లర మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముమ్మాటికీ తెలంగాణకు కాంగ్రెస్ పార్టీనే విలన్ అని పేర్కొన్నారు. 1969 ఉద్యమ సమయంలో 359 మందిని కాల్చి చంపిన పాపం కాంగ్రెస్‌ది కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ దీక్షా సమయంలో విద్యార్థుల బలిదానాలకూ కాంగ్రెస్సే కారణమని మండిపడ్డారు.

## ఈటలపై కేసును కొట్టివేయలేం: హైకోర్టు

హైదరాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ): మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చేయి చేసుకున్నారని ఎంపీ ఈటల రాజేందర్‌పై కేసు నమోదైంది. ఆ కేసు దర్యాప్తు ప్రారంభ దశలోనే జోక్యం చేసుకుని మినీ ట్రయల్ నిర్వహించేలా ఆదేశించమని చెబుతూ.. ఈటల దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. విచారణను చట్టప్రకారం కచ్చితంగా నిర్వహించాలని దర్యాప్తు అధికారిని ఆదేశించింది. ఏకశిలా నగర్‌లో సామాన్యుల భూమిని కబ్జా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈటల గత జనవరిలో పేర్కొన్నారు. ఆ భూమిని పరిశీలించేందుకు వెళ్లిన ఆయన, ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారిని కొట్టారు. దానిపై వాచ్‌మన్ ఉపేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ సోమవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఇది రాజకీయ కక్ష సాధింపులో భాగంగా పెట్టిన కేసని తెలిపారు. ప్రాథమిక ఆధారాలు ఉన్నందునే పోలీసులు కేసు నమోదు చేశారని పీపీ పల్లె నాగేశ్వర్‌రావు చెప్పారు. పీపీ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి కేసు కొట్టివేసేందుకు నిరాకరించారు.

## రేవంత్ ఔట్‌సోర్సింగ్ సీఎం

- ఆయన పరివారం బీజేపీ.. వ్యవహారం టీడీపీ!
- అందుకే మోదీకి, బాబుకు ఆయనంటే ఇష్టం
- కేసీఆర్ ఆనవాళ్లు చెరపడమంటే తెలంగాణను ఆంధ్రాలో కలపడమ